రణస్థలంలో ఫ్లైఓవర్


రణస్థలంలో ఫ్లైఓవర్ పనులు

- అమరావతి వేదికగా ప్రధాని మోదీ శంకుస్థాపన
- ఊపందుకోనున్న నిర్మాణ పనులు

రణస్థలం, మే 2(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు రణస్థలంలో జాతీయ రహదారి ఆరులేన్ల వంతెన పనులకు సంబంధించి ప్రధాని మోదీ శుక్రవారం శంకుస్థాపన చేశారు. అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులకు విచ్చేసిన ప్రధాని మోదీ.. రాష్ట్రంలో వివిధ జాతీయ రహదారులకు సంబంధించి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా రణస్థలంలో రూ.252 కోట్ల నిర్మాణంతో ఐదు కిలోమీటర్లకుపైగా ఫ్లైఓవర్, విస్తరణ పనులకు అమరావతి వేదికగా వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. మొత్తం ఐదు కిలోమీటర్లకుపైగా ఇక్కడ రోడ్డు విస్తరణ జరగనుంది. అందులో దాదాపు 2 కిలోమీటర్ల మేర ఓపెన్ ఫ్లైఓవర్ ఉండనుంది. విశాఖలో ఆర్టీసీ కాంప్లెక్స్, ఆశీలుమెట్ట తరహాలో భారీ స్తంభాలతో వంతెన ఇక్కడ ఏర్పాటు కానుంది. కొద్దిరోజుల కిందట ఇక్కడ ఫ్లైఓవర్, విస్తరణకు సంబంధించి పనులు ప్రారంభమయ్యాయి. స్థానికుల అభ్యంతరాలతో వివాదాలు జరిగాయి. వారికి స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అవగాహన కూడా కల్పించారు. ఇప్పుడు నేరుగా ప్రధాని మోదీ శంకుస్థాపన చేయడంతో పనులు ఊపందుకోనున్నాయి.

● ఇదీ పరిస్థితి..

విశాఖ నుంచి నరసన్నపేట వరకూ దాదాపు 135 కిలోమీటర్ల మేర జాతీయ రహదారిని ఆరు లేన్లగా విస్తరించారు. కానీ రణస్థలం మండల కేంద్రాన్ని మాత్రం పెండింగ్‌లో పెట్టారు. దీనిపై ఆరేళ్లగా సందిగ్ధం కొనసాగుతోంది. మండల కేంద్రాన్ని తప్పించి బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. అలాగని ఫ్లైఓవర్ నిర్మించలేదు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రణస్థలం మండల కేంద్రాన్ని తప్పించి బైపాస్ రోడ్డు నిర్మాణానికి 2016లో గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. అప్పటి కేంద్రమంత్రి అశోక్‌గజపతిరాజు, స్థానిక ఎమ్మెల్యే కళా వెంకటరావు కృషి మేరకు.. దన్నానపేట నుంచి లావేరు మండలం రావివలస వరకూ 3.5 కిలోమీటర్ల మేర బైపాస్ నిర్మాణానికి నిర్ణయించారు. సుమారు 66ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. భూసేకరణకు కూడా చేపట్టారు. ఎచ్చెర్ల మండలం చిలకపాలెం, ఎచ్చెర్లలో సేకరించిన భూములకు మాదిరిగా పరిహారం చెల్లించాలని నిర్ణయించారు. మార్కెట్ ధర ప్రకారం సెంటు భూమికి రూ.2 లక్షలకుపైగా చెల్లిస్తామని ప్రకటించారు. కానీ అప్పట్లో విపక్షంగా ఉన్న వైసీపీ నేతలు ఈ పరిహారం పెంచాలని డిమాండ్ చేశారు. అయితే మిగతా ప్రాంతాల్లో రోడ్ల విస్తరణపై దృష్టి పెట్టిన హైవే అథారిటీ అధికారులు రణస్థలం విషయాన్ని పెండింగ్ పెట్టారు.

● మాట మార్చిన వైసీపీ..

వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత (మిగతా 6వ పేజీలో..)

అమరావతిలో జిల్లా నేతలు..

అమరావతిలో రాజధాని పునరుద్ధరణ పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. శుక్రవారం అమరావతి వేదికగా పలు అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మోదీ సభకు జిల్లా నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన నేతలతోపాటు వేలాది మంది ప్రజలు తరలివెళ్లారు. సీఎం చంద్రబాబుతో కలిసి కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు తదితరులు మోదీకి ఘన స్వాగతం పలికారు.


ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుతో కేంద్రమంత్రి రామ్మోహన్ ముచ్చట్లు


ప్రధానమంత్రి మోదీకి స్వాగతం పలుకుతున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్


అమరావతిలో వేదిక వద్ద మంత్రి అచ్చెన్న విజయ సంకేతం


టెక్కలి వ్యూ

మునిసిపాలిటీగా టెక్కలి!

- తెరపైకి మళ్లీ ప్రతిపాదనలు
- ప్రజల్లో చిగురిస్తున్న ఆశలు

టెక్కలి, మే 2(ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రమైన టెక్కలి మేజర్ పంచాయతీ మునిసిపాలిటీగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టెక్కలిని జిల్లాకేంద్రానికి దీటుగా అభివృద్ధి చేస్తానని పలుమార్లు ప్రకటించారు. టెక్కలిని మునిసిపాలిటీగా చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఇటీవల మరోసారి స్పష్టం చేశారు. దీంతో టెక్కలివాసులు మునిసిపాలిటీపై ఆశలు పెట్టుకున్నారు. దశాబ్దాల కల నెరవేరనుందని ఆశాభావం వ్యక్తం (మిగతా 6వ పేజీలో..)



అరసవల్లిలో ప్రహరీ లేని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

డాక్టర్ ఇప్పుడే బయటకెళ్లారు!

- పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అరకొర సేవలు
- అందుబాటులో ఉండని వైద్యులు
- కనీస సౌకర్యాలు కరువు
- కొరవడుతున్న పర్యవేక్షణ
- రోగులకు తప్పని ఇబ్బందులు


అరసవల్లి యూపీహెచ్‌సీలో ఇదీ పరిస్థితి..

అరసవల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు వైద్యసేవలు సక్రమంగా అందడం లేదు. శ్రీకాకుళం నగరంలోని యూపీహెచ్‌సీల్లోని చాలాచోట్ల వైద్యులు అందుబాటులో ఉండడం లేదు. దీంతో సిబ్బందే మొక్కుబడిగా సేవలందిస్తున్నారు. చాలామంది వైద్యులు హాజరు వేసుకుని.. వ్యక్తిగత పనులపై వెళ్లిపోతున్నారు. దీంతో రోగులు గంటల తరబడి నిరీక్షిస్తూ.. నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఆర్థికభారమైనా తప్పనిసరి పరిస్థితుల్లో కొంతమంది రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. రూ.కోట్లాది వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలు గగనమవుతున్నాయని ఆరోపిస్తున్నారు.


గుజరాతీపేట యూపీహెచ్‌సీ దుస్థితి ఇలా..

● అరసవల్లిలో.. అందుబాటులో ఉండరు

అరసవల్లిలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఎప్పుడు వచ్చినా.. డాక్టర్ గారు ఇప్పుడే బయటకు వెళ్లారని సిబ్బంది చెబుతున్నట్లు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరకు స్టాఫ్‌నర్సు, ఇతర సిబ్బంది రోగులకు వైద్యసేవలు అందిస్తూ నెట్టుకొస్తున్నారు. రూ. కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఆసుపత్రికి ప్రహరీ లేకపోవడంతో రాత్రివేళ ప్రాంగణమంతా అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

● కంపోస్టు కాలనీలో యూపీహెచ్‌సీలో రోజూ 60 మందికిపైగా రోగులు వైద్యసేవలు పొందుతున్నారు. ఉచితంగా పరీక్షలు, మందులు సరఫరా చేయడంతో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులు ఎక్కువగా వస్తుంటారు. ఇక్కడ స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తే మరింత మెరుగైన (మిగతా 6వ పేజీలో..)


ఆమదాలవలస: రావికంటిపేట వద్ద కూలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ 6లో

గాలీవాన బీభత్సం

- నేల కూలిన విద్యుత్ స్తంభాలు
- పంటలకు తీవ్ర నష్టం

దేవతామూర్తుల విగ్రహాలు ధ్వంసం

- బీజేపీ, సమరసత సేవా సంస్థ ప్రతినిధుల నిరసన

8లో

చినుకు పడితే చెరువే

- రోడ్డుపైకి మురుగునీరు
- పట్టించుకోని పాలకులు
- ఇది కత్తెరవీధి వాసుల వ్యథ

7లో

ఆదిత్యాలయ సిబ్బంది వేతనాలు విడుదల

అరసవల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలోని ఆదిత్యాలయంలో దినసరి సిబ్బందికి ఎట్టకేలకు వేతనాలు విడుదలయ్యాయి. 14నెలలుగా వేతనాలు లేక సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయం ఇటీవల ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో.. వారికి పూర్తి కాలానికి వేతనాలు ఇవ్వాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో శుక్రవారం వారికి ఐదు నెలలకు వేతనాలు విడుదల చేశారు. మిగిలిన బకాయిలు మళ్లీ విడుదల చేస్తామని ఆలయ అధికారులు తెలియజేశారు.

నాన్‌బెయిలబుల్ వారెంట్లపై దృష్టి

- సమగ్ర దర్యాప్తుతో కేసులు ఛేదించాలి
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



శ్రీకాకుళం క్రైం, మే 2(ఆంధ్రజ్యోతి): నిందితులపై పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్ల (ఎన్‌బీడబ్ల్యూ)పై దృష్టిపెట్టి త్వరితగతిన అమలు చేయాలని ఎస్పీ కెవి మహేశ్వరెడ్డి ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఎన్‌బీడబ్ల్యూ, ప్రాపర్టీ కేసులు, చైన్ స్నాచింగ్, వాహనాల దొంగతనం, ఆస్తి నేరాల దర్యాప్తుపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ సమగ్ర దర్యాప్తు చేసి ప్రాపర్టీ కేసులను ఛేదించాలని, రికవరీ శాతం పెంచాలని ఆదేశించారు. ముద్దాయిలపై కోర్టు జారీ చేసిన ఎన్‌బీడబ్ల్యూ పెండింగ్ వివరాలపై ఆరా తీశారు. మహిళలపై దాడులు, ఎస్సీ ఎస్టీ, పోక్సో వంటి కేసుల్లో నిర్ణీత సమయంలో సంబంధిత వ్యక్తుల వివరాలను బట్టి వారిని కోర్టులో హాజరుపరచాలని సూచించారు. కేసుల్లో పురోగతి సాధించాలని, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు కోటేశ్వరరావు, నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆరంభం అధరహో

- బస్తా జీడి పిక్కలు రూ.13,500
- ఆశించిన స్థాయిలో రేటు పెరగడంతో రైతుల్లో హర్షం


ఉద్దానం జీడిపిక్కలు

పలాస, మే 2(ఆంధ్రజ్యోతి): జీడి పిక్కల ఆరంభంలోనే ధర ఆశించినంతగా పెరగడంతో అమ్మకాలు జోరందుకున్నాయి. సాధారణంగా జీడి పిక్కల సీజను ప్రారంభంలో ధర నామమాత్రంగా ఉండి.. తర్వాత మార్కెట్‌కు అనుగుణంగా పెరుగుతుంటుంది. కానీ ఈ ఏడాది మాత్రం ప్రారంభంలోనే 80 కిలోల జీడి బస్తా రూ.13,500గా నమోదై రికార్డు సృష్టించింది. ఏప్రిల్ నుంచి మూడు నెలలపాటు జీడి పిక్కల సీజను ఉంటుంది. జీడి బస్తా రూ.16వేలు కనీస మద్దతు ధర పెంచాలని, మార్క్‌ఫెడ్ ద్వారా జీడి గింజలు కొనుగోలు చేసి వ్యాపారులకు నేరుగా ప్రభుత్వమే అమ్మకాలు సాగించాలని జీడి పిక్కల పోరాట కమిటీ కొన్నాళ్లుగా డిమాండ్ చేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం.. మార్కెట్‌లో లభించిన ధరకు అదనంగా రూ.వెయ్యి మద్దతు ధర ఇస్తామని ప్రకటించింది. కానీ, ఒక్క రైతుకు కూడా ఆ డబ్బులు చెల్లించలేదు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో జీడిపప్పు ధరలు పెరగడంతో పిక్కల ధర కూడా అదేస్థాయిలో పెరిగింది. గతేడాది రూ.10వేలు ఉండగా.. ఈ ఏడాది రూ.13,500 వరకూ పలుకుతోంది. ఇప్పటికే వ్యాపారులు బ్రోకర్ల సహాయంతో జీడి గింజలు కొనుగోలు చేస్తున్నారు. విదేశీ జీడిపిక్కలు మార్కెట్‌లో లభిస్తున్నా, రూ.12వేలకు మించి అమ్ముడు కావడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. దేశీయంగా లభించే జీడిపిక్కలకు మంచి మార్కెట్ ఉండడంతో గ్రామాల్లో రైతుల నుంచి వాటిని కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో 35వేల హెక్టార్లలో జీడి పంట సాగవుతోంది. 2018 తితలీ తుఫానులో మొత్తం జీడి పంట నాశనం కాగా.. 2019లో నామమాత్రంగా జీడి పిక్కలు లభించాయి. దీంతో విదేశాల నుంచి జీడిపిక్కలు భారీస్థాయిలో (మిగతా 6వ పేజీలో..)

12 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం కలెక్టరేట్, మే 2(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. పరీక్షలకు సంబంధించి ఆయన శుక్రవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'ఈ నెల 12 నుంచి 20 వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో 56కేంద్రాల్లో నిర్వహించనున్న ఈ పరీక్షలకు 21,571 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి 12 వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు జరుగుతాయి. విద్యార్థులకు సరిపడా బస్సులను నడపాలి. కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, ప్రథమ చికిత్స శిబిరాలు ఏర్పాటు చేయాలి' అని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఏఎస్పీ శ్రీనివాసరావు, వృత్తివిద్యాధికారి నరేష్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత పాల్గొన్నారు.




పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం

అద్భుతంగా అమరావతి

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోం దని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి


కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు




సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు


మహిళల విజయ దరహాసం




దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు


సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు


సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు


గ్యాలరీల బయట జనం

గాలివాన బీభత్సం

- నేల కూలిన విద్యుత్ స్తంభాలు
- పంటలకు తీవ్ర నష్టం

ఉరుములు.. మెరుపులు... ఈదురు గాలులతో కూడిన వర్షం గురువారం రాత్రి బీభత్సం సృష్టించింది. మొక్కజొన్న, అరటి, మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. చెట్లు పడిపోయాయి ఆమదాలవలసలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయం గోడ కూలిపోయింది. విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో వివిధ ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలిగింది. ఎచ్చెర్లలో చాలాచోట్ల గురువారం రాత్రి 11 నుంచి శుక్రవారం సాయంత్రం 4.30 వరకు దాదాపు 17 గంటలసేపు విద్యుత్ లేదు. అనేకచోట్ల చెట్లు రోడ్డుపై పడడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎల్‌ఎన్‌పేట ఎంపీడీవో కార్యాలయం వద్ద పిడుగు పడడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమైంది. శ్రీకాకుళంలోని పాత చెక్ పోస్టు వద్ద పంట కాలు వపై వేసిన కాజ్‌వే వర్షానికి కుంగిపోయింది. సోంపేట మండలం పాలవలస పంచాయతీలోని కుమ్మరి పాడుకు చెందిన కాళ్ల మన్మథరావుకు చెందిన 13 గొర్రెలు పిడుగుపాటుతో మృతిచెందాయి.

-ఆంధ్రజ్యోతి బృందం


ఆమదాలవలస: జూనియర్ కళాశాల ప్రధాన రహదారిపై కూలిన చెట్టు


శ్రీకాకుళం: ఆదివారంపేట రోడ్డులో గాలులకు నేలకూలిన దుకాణాలు


ఎల్‌ఎన్‌పేట: కొత్త విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చుతున్న సిబ్బంది


గార: తూలుగు వద్ద విద్యుత్ స్తంభాలను పునరుద్ధరిస్తున్న సిబ్బంది


శ్రీకాకుళం: దెబ్బతిన్న కాజ్‌వే


ఎచ్చెర్ల: పొన్నాడ ఎస్సీ కాలనీలో ఓ ఇంటిపై పడిన విద్యుత్ స్తంభం


శ్రీకాకుళం: ఇంటి వద్ద చేరిన వరద నీటిని మోటారుతో తోడుతున్న దృశ్యం


సోంపేట: మృతిచెందిన గొర్రెల వద్ద విలపిస్తున్న రైతు మన్మథరావు

రణస్థలంలో ఫ్లైఓవర్

(ఐదో పేజీ తరువాయి)

పరిహారం విషయంలో ఆ పార్టీ నేతలు మాట మార్చారు. సెంటుకు మొదటి అనుకున్నంత ధర ఇవ్వలేమని 30 శాతం తగ్గించి ఇస్తామని ప్రకటించారు. దీంతో రైతుల నుంచి వ్యతిరేకత ప్రారంభమైంది. బైపాస్ నిర్మించాలంటే దాదాపు ఐదుచోట్ల వంతెనల నిర్మాణం చేపట్టాలి. రైతులకు పరిహారం చెల్లించాలి. ఈ మొత్తం లెక్కలు వేసుకున్న హైవే అథారిటీ అధికారులు మాత్రం రణస్థలంలో ఫ్లైఓవర్ నిర్మాణానికే మొగ్గుచూపారు. అప్పటికే రైతుల నుంచి సేకరించిన 66 ఎకరాలను తిరిగి వారికి అప్పగిస్తూ ప్రభుత్వం సైతం ఉత్తర్వులు జారీచేసింది. కొద్దిరోజుల కిందట టెండర్లు పూర్తయ్యాయి. సంబంధింత సంస్థ పనులు కూడా ప్రారంభించింది. తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయడంతో రెండేళ్లలో పనులు పూర్తిచేయాలని కేంద్ర జాతీయ రహదారుల సంస్థ భావిస్తోంది.

ఆరంభం అ'ధర'హో

(ఐదో పేజీ తరువాయి)

రప్పించి పీలింగ్ చేశారు. ప్రస్తుతం పాడయిన పంట తిరిగి పుంజుకోవడంతో అనేక ప్రాంతాల్లో పంట ఆశించిన స్థాయిలో ఉండడంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉద్దానం ప్రాంతంలో జీడి పంట ఎకరాకు సరాసరి 4 నుంచి ఆరు బస్తాల వరకూ పండుతుంది. దీని ప్రకారం రైతులకు ఎకరాకు రూ.54 వేలు నుంచి రూ.81వేల వరకూ ఆదాయం వచ్చే అవకాశం ఉంది. కొన్ని గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న ధర కంటే పెరిగే అవకాశం ఉండడంతో రైతులు వాటిని నిల్వ చేస్తున్నారు. రెండు నెలల తరువాత జీడి పిక్కల ధరలు పెరిగితే అమ్ముకోవచ్చనే ఆలోచనలో ఉన్నారు.

మునిసిపాలిటీగా టెక్కలి!

(ఐదో పేజీ తరువాయి)

చేస్తున్నారు. 2010లో టెక్కలికి చెందిన డాక్టర్ కిల్లి కృపారాణి కేంద్రమంత్రిగా ఉన్నప్పుడే మునిసిపాలిటీగా అవకాశం లభించింది. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొందరు మునిసిపాలిటీ కాకుండా అడ్డుకున్నారు. 2016లో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హయాంలో సైతం టెక్కలి మునిసిపాలిటీగా ఏర్పాటుకు మరో అవకాశం వచ్చినా అప్పట్లో సద్వినియోగం చేసుకోలేదు. దీంతో టెక్కలి మునిసిపాలిటీ వ్యవహారం తెరమరుగైంది. ఈసారి టెక్కలిని మునిసిపాలిటీగా చేస్తానని మంత్రి అచ్చెన్న మరోసారి ప్రకటించడంతో కార్యరూపం దాల్చే అవకాశం కనిపిస్తోంది. టెక్కలి 38వేల జనాభా ఉన్నారు. అవసరమైతే టెక్కలికి ఆనుకుని ఉన్న తొలుసూరుపల్లి, సీతాపురం, భగవాన్‌పురం, అక్కువరం, అయోధ్యపురం, బన్నువాడ గ్రామపంచాయతీలను అవసరమైతే టెక్కలి మునిసిపాలిటీలో విలీనానికి సైతం మార్గాలు ఉన్నాయి. టెక్కలిలో 20కు పైగా వార్డుల్లో 8,500 కు పైగా కుటుంబాలు నివశిస్తున్నాయి. 4.04 చదరపు మైళ్ల విస్తీర్ణం ఉంది. ఏడాదికి సుమారు కోటి రూపాయలు ఆదాయం సమకూరుతోంది. దీంతో మునిసిపాలిటీ ఏర్పాటుకు అవకాశాలు దగ్గరగా ఉన్నాయి. గ్రామ పంచాయతీ యంత్రాంగం పాలన కూడా గడువు దగ్గరపడుతోంది. ఈ నేపథ్యంలో టెక్కలి మునిసిపాలిటీగా ఎప్పుడు మారుతుందా? అని స్థానికులు ఎదురుచూస్తున్నారు. మంత్రి అచ్చెన్నాయుడు ఇచ్చిన వాగ్దానం మేరకు టెక్కలిని మునిసిపాలిటీగా మార్చి.. మరింత అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

డాక్టర్ ఇప్పుడే బయటకెళ్లారు!

(ఐదో పేజీ తరువాయి)

వైద్యసేవలు అందించే అవకాశం ఉంది.

● గుజరాతీపేటలో సమస్యల నిలయం..

గుజరాతీపేట యూపీహెచ్‌సీకి నిత్యం సుమారు 50 మంది రోగులు వస్తుంటారు. ఈ ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకుని.. సీలింగ్ పెచ్చులూడిపోతున్నాయి. గోడలు బీటలు వారిపోయాయి. దీంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ వైద్యసేవలు అందిస్తున్నారు. ఇక్కడ కనీసం నీరు కూడా అందుబాటులో ఉండదు. టాయిలెట్లు మూతపడడంతో మహిళా సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ల్యాబ్ పరీక్షల కోసం బకెట్లతో నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ భవనానికి మరమ్మతులు చేపట్టి.. కనీస సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

డీసీసీబీ కాలనీలో ఆస్పత్రి అడ్రస్ ఎవరికీ తెలీదు..

డీసీసీబీ కాలనీలోని యూపీహెచ్‌సీలో ఏడాది కిందట వైద్యసేవలు ప్రారంభమయ్యాయి. కొత్తగా నిర్మించిన భవనంలోకి ఆస్పత్రిని మార్చారు. కాగా.. ఇక్కడ ఒక ప్రభుత్వ ఆసుపత్రి ఉందనే విషయం ఈ ప్రాంతంలో ఉన్న చాలా మందికే తెలియదు. అలాగే వైద్యుడు కూడా సరిగా అందుబాటులో ఉండడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ రోగులకు పరీక్షలు నిర్వహించే సీబీసీ మిషన్ పాడైపోయి ఏడాదవుతున్నా బాగుచేయలేదు. ప్రస్తుతం రోజుకు 20 మంది వరకు రోగులు ఈ ఆస్పత్రికి వస్తున్నారు. ఆస్పత్రి బోర్డులు ఏర్పాటు చేసి, వైద్యుడు అందుబాటులో ఉంటే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

● బర్మా కాలనీలో ఫార్మసిస్టే వైద్యుడు..

బర్మా కాలనీలో యూపీహెచ్‌సీని.. పాత భవనంలోనే నిర్వహిస్తున్నారు. ఈ ఆస్పత్రికి రోజూ 60 మంది వరకు రోగులు వస్తుంటారు. వైద్యుడు సక్రమంగా అందుబాటులో లేకపోవడంతో ఫార్మాసిస్టు, స్టాఫ్‌నర్సు సేవలు అందిస్తున్నారు. ఇక్కడకు ప్రతీ శుక్రవారం గైనకాలజిస్టు వస్తారు. గర్భిణులకు స్కానింగ్ చేస్తుంటారు. కానీ ఇక్కడ బెడ్స్‌లేక ఇబ్బందులు తప్పడం లేదు. ఆస్పత్రి బయట కాలువలో మురుగు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది.

● అభివృద్ధి కమిటీలను నియమిస్తేనే..

ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన ఎటువంటి పనులు చేయాలన్నా, సేవలు మెరుగుపడాలన్నా అభివృద్ధి కమిటీలు కీలకం. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకూ ఆస్పత్రి అభివృద్ధి కమిటీలను నియమించలేదు. ఆసుపత్రులపై పర్యవేక్షణ లేకపోవడంతో యూపీహెచ్‌సీల్లో అరకొరగా సేవలు అందుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి యూపీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చినుకు పడితే చెరువే

- రోడ్డుపైకే మురుగునీరు
- మండు వేసవిలోనూ అంతే..
- పూడుకుపోయిన కాలువలు
- పట్టించుకోని పాలకులు
- ఇది కత్తెరవీధి వాసుల వ్యథ


తలతంపరలో రోడ్డుపైకి చేరిన మురుగునీరు

డ్రైనేజీలు శిథిలమై..


చెత్తతో నిండిన కాలువ

కంచిలి, మే 2(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీలు శిథిలమై, కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగంతా రోడ్డుపైనే ప్రవహిస్తుంది. ఈ పరిస్థితి తలతంపర పంచాయతీలో నెలకొంది. కాలువలు పూడుకుపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నాళ్లగా కాలువలు శుభ్రం చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని మండిపడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి, కాలువల్లో పేరుకుపోయి చెత్తాచెదారాన్ని తొలగించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.


నివాసాల మధ్య నిలిచిన మురుగు

అరసవల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): మండే ఎండలు, నీరులేక ఎండిపోయిన చెరువులు, నదులు. ఎక్కడ చూసినా నీటి జాడల కోసం ఆరాటం. కానీ శ్రీకాకుళం నగరంలోని కత్తెరవీధిలో పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నం. నిత్యం రోడ్లపై చెరువును తలపిస్తూ మురుగునీరు. చిరుజల్లులు కురిసినా సరే మోకాలు లోతు నీటిలో ప్రయాణం చేయాల్సిందే. మురుగు కాలువల్లో నీరు నిండిపోయి, రోడ్డుపై ప్రవహిస్తూనే ఉంటుంది. మండు వేసవిలోను మురుగు నీటితో నిండిన రోడ్లు ప్రజలకు సదా దుర్గంధాన్ని వెదజల్లుతూనే ఉంటాయి. ఇక్కడి కాలువల్లో మురుగు నిండిపోయి, నీరు కదలకుండా ఉండిపోవడంతో ఈ ఇబ్బంది నిత్యం తలెత్తుతోంది. కాలువల్లో పూడిక తీసి, పలకలు సరిచేస్తే పరిస్థితి సాధారణంగానే ఉండే అవకాశం ఉంది. అయితే ఎన్ని విన్నపాలు చేసినా పట్టించుకునే నాథుడు కరవయ్యాడు. వేసవిలోనే పరిస్థితి ఇలా ఉంటే, మరి వర్షాకాలంలో పరిస్థితి ఊహించుకుంటేనే ఇక్కడి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మా ఇబ్బందికి పరిష్కారం ఎప్పుడో? అంటూ ఆశగా ఎదురుచూస్తున్నారు. అధికారులు, నాయకులు వస్తున్నారు.. పోతున్నారు.. కానీ పరిస్థితి మారడం లేదు. బాగుచేసి సమస్యలను పరిష్కరించాలని మరోసారి అధికారులను వారు కోరుతున్నారు.

ఎప్పుడూ ఇదే పరిస్థితి



ఏడాది పొడవునా వీధిలో మురుగునీరు రోడ్డుపైనే నిలిచి ఉంటుంది. వర్షాకాలంలో పరిస్థితి మరింత దుర్భరంగా తయారవుతోంది. దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతూనే ఉన్నాం. ఏళ్లు గడుస్తున్నా ఇదే పరిస్థితి. దయచేసి అధికారులు, నాయకులు స్పందించి మా సమస్యను పరిష్కరిస్తే వారికి రుణపడి ఉంటాం.

- వి.నవీన్‌చంద్రుడు, రిటైర్డు హెచ్‌ఎం


రోడ్డుపై చేరిన మురుగునీరు

ఖాజీపేటలోనూ ఇంతే..


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

పొందూరు, మే 2(ఆంధ్రజ్యోతి): కింతలి పంచాయతీ ఖాజీపేట గ్రామంలో మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. గ్రామంలోని కాలువలు సక్రమంగా లేకపోవడంతో వాడుకనీరు రోడ్డుపైకే వస్తోంది. తాగునీరు అందించే కుళాయి చుట్టూ మురుగు పేరుకుపోయింది. అందువల్లే తరచూ గ్రామంలో అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకు స్పందించి గ్రామంలో కాలువల వ్యవస్థ సక్రమంగా నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పరీక్ష రాసేందుకు డిబారైన విద్యార్థులకు అనుమతి

గుజరాతీపేట, మే 2(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మార్చి నెలలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో భాగంగా కుప్పిలి హైస్కూల్‌లో డిబారైన ఐదుగురు విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అనుమతులిస్తూ డీఈవో ఎస్.తిరుమల చైతన్య ఉత్తర్వులు జారీ చేశారు. ఇంగ్లీషు పరీక్ష స్లిప్‌లుపెట్టి చూసి రాస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ వచ్చి ఐదుగురు విద్యార్థులను డిబార్‌తోపాటు ఉపాధ్యాయులకు సస్పెన్షన్ చేసిన ఘటన రాష్ట్రంలో సంచలనం కలిగించిన విషయం విదితమే. అయితే ఆ ఘటన జరిగినప్పటి నుంచి జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలు ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేయడంతోపాటు పదో తరగతి స్పాట్ కూడా బాయ్‌కట్ చేస్తామని హుకుం జారీ చేయడంతో, జిల్లా అధికారులు చొరవ చూపి ఉపాధ్యాయులపై సస్పెన్షన్లు, కేసులు ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. నాటి నుంచి విద్యార్థుల డిబార్ కూడా ఎత్తివేయాలంటూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభ్యర్థించారు. వీటినన్నింటినీ పరిశీలించిన అధికారులు విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ఆ ఐదుగురు విద్యార్థులపై డిబార్‌ను ఎత్తివేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఈ నెల 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి.

సిలంబం క్రీడాకారుల ప్రతిభ



పతకాలతో జిల్లా క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సిలంబం (కర్రసాము) చాంపియన్‌షిప్ పోటీల్లో నగరానికి చెందిన క్రీడాకారులు ఎనిమిది పతకాలు కైవసం చేసుకున్నారు. గత నెల 30వ తేదీన ఏలూరు జిల్లా కలిదిండిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీకాకుళం నుంచి ఆరుగురు క్రీడాకారులు పాల్గొనగా మొత్తం 8 పతకాలు సొంతం చేసుకున్నట్లు శిక్షకులు హర్ష తెలియజేశారు. బి.భావనశ్రీ సింగిల్ స్టిక్‌లో (బంగారు), డబుల్ స్టిక్‌లో (కాంస్యం), ఫైట్ (బంగారం) పతకాలు సొంతం చేసుకోగా, ఆర్.నరేంద్ర నాయుడు సింగిల్ స్టిక్‌లో (బంగారం), ఫైట్‌లో (రజితం), కత్తి యుద్ధం (స్వార్డ్)లో (బంగారు) పతకాలు సాధించారు. అలాగే టి.పవన్ కల్యాణ్ సింగిల్ స్టిక్‌లో (బంగారం), ఫైట్‌లో (బంగారం) పతకాలు సాధించగా, బి.వెంకటరమణ ఫైట్‌లో రజిత పతకాన్ని సొంతం చేసుకున్నారు. దీనితోపాటు శ్రీకాకుళం జిల్లా జట్టుకు ద్వితీయస్థానం సొంతం చేసుకోవడం గమనార్హం.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి


జీపు జాతలో పాల్గొన్న రైతు సంఘ నాయకులు

ఎచ్చెర్ల, మే 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లోని ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తిచేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. పూడివలసలో శుక్రవారంలో నిర్వహించిన జీపు జాతలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7న పెండింగ్ ప్రాజెక్టుల సాధన కోసం కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాలో అధిక సంఖ్యలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్రరావు, కె.మోహనరావు, కౌలు రైతుల సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెలమల రమణ, పోలాకి ప్రసాదరావు, భవిరి కృష్ణమూర్తి, కొత్తకోట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్ పనులకు భూమిపూజ

ఇచ్ఛాపురం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని చెక్‌డ్యామ్‌లు బాగుచేయడమే టీడీపీ లక్ష్యమని ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ బెందాళం అశోక్ అన్నారు. శుక్రవారం మండలం ఇన్నేసుపేట పద్మపురం గెడ్డపై చెక్ డ్యామ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. చెక్ డ్యామ్ నిర్మాణానికి రూ.29 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు, కె.ఎర్రోయ్య, ఈ.సారథి, శంకర్ నారాయణ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరావతి వేదికపై సిక్కోలు నృత్యం


శ్రీలతతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆమదాలవలస, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి పునర్నిర్మాణ సమావేశ వేదికపై ఆమదాలవలస పట్టణానికి చెందిన కూన శ్రీలత నృత్య ప్రదర్శన ఇచ్చింది. శుక్రవారం ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొనే ఈ సభావేదికపై అమరావతి చరిత్ర తెలుపుతూ సాగే పాటకు నృత్య ప్రదర్శన చేశారు. వీరిని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అభినందించారు.

ఉగ్రదాడులు హేయమైన చర్య

అరసవల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): పెహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ శ్రీకాకుళంలో ప్రజావేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఏడురోడ్ల జంక్షన్ నుంచి కృష్ణాపార్కు మీదుగా డే అండ్ నైట్ నుండి కోడి రామ్మూర్తి స్టేడియం వరకు ఈ ర్యాలీ సాగింది. డాక్టర్లు, లాయర్లు, కవులు, రచయితలు, పెన్షనర్లు, విద్యార్థి సంఘం, ఉపాధ్యాయులు ఈ ర్యాలీలో పాల్గొని నినాదాలు చేశారు. వైద్యులు కణుగుల సుధీర్, రచయిత అట్టాడ అప్పలనాయుడు, జామి భీమశంకర్, కె.శ్రీనివాస్, బి.కృష్ణమూర్తి, ఎం.ప్రభాకరరావు తదితరుల పాల్గొన్నారు.

బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లు సక్రమంగా చేపట్టాలి: కలెక్టర్


ఏర్పాట్లపై ఆరా తీస్తున్న కలెక్టర్ ఫుండ్కర్

సోంపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): బారువ బీచ్ ఫెస్టివల్స్ ఏర్పాట్లు పగడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం బారువ బీచ్‌లో బీచ్ ఫెస్టివల్స్ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. స్పోర్ట్స్ ఏర్పాట్లపై చర్చించారు. పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించి చర్చించారు. బీచ్ అంతా శుభ్రంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం ఆలివ్ రిడ్లీ తాబేళ్లను సముద్రంలో విడిచిపెట్టారు. ట్రైనీ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్‌కుమార్, ఆర్డీవోలు కె.సాయి ప్రత్యూష, జి.వెంకటేష్, ఆర్ అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, వ్యవసాయశాఖ జేడీ త్రినాధస్వామి, డీఈవో తిరుమల చైతన్య, డీపీవో కె.భారతి సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

● సోంపేట, మే 2(ఆంధ్రజ్యోతి): బారువ తీరంలో శనివారం నుంచి రెండురోజులు పాటు జరిగే బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్, రెవెన్యూ అధికారులతో సమీక్ష జరిపారు. పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సూరాడ చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేవరకు పోరాడుతాం

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 2(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించే వరకు పోరాడుతామని సీహెచ్‌వోల సంఘ నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఏడురోడ్ల కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ గేటు వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. సుమారు 200 మంది సభ్యులు హాజరయ్యారు. స్థానిక పూలే పార్కువద్ద ఏర్పాటు చేసిన దీక్ష శిబిరంలో నిరసన ప్రదర్శనను కొనసాగించారు.

చంద్రబాబుకు కృతజ్ఞతలు

అరసవల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని నరేంద్రమోదీ వస్తున్నందున ఆ కార్యక్రమానికి సంబంధించి సభకు గుండ దంపతులకు ఆహ్వానం అందింది. దీంతో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. తన భర్త, మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ ఆరోగ్యం బాగులేనందు వల్ల రాలేకపోతున్నట్టు ఆమె ముఖ్యమంత్రికి లేఖ రాశారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

ఇచ్ఛాపురం, మే 2(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మున్సిపాల్టీ పరిధిలో గల పెండింగ్‌లో ఉన్న అన్ని గృహాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ డీఈఈ వి.సతయాజి అధికారులకు ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో కమిషనర్ ఎన్.రమేష్ అధ్యక్షతన అర్బన్ వార్డు అమెనిటీస్ సెక్రటరీలతో సమీక్షించారు. ఈఈ నరసింగరావు, ఏఈలు ప్రసాద్, విశ్వనాథ్, పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన


కార్మికులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

బూర్జ, మే 2(ఆంధ్రజ్యోతి): కొళపర్తి పంచాయతీలో నిర్మించిన చెత్త సంపద కేంద్రాన్ని డీఎల్‌పీవో రమణ శుక్రవారం సందర్శించారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. సర్పంచ్ బొడ్డేపల్లి వరహాలనాయుడు, పారిశుధ్య కార్మికులు ఉన్నారు.

● ఆమదాలవలస, మే 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అపరిశుభ్రతను తొలగించి పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని డీఎల్‌పీవో ఐవీ రమణ అన్నారు. శుక్రవారం అక్కులపేట పంచాయతీలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. కార్య క్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి విక్రమ్, వ్యవసాయ సహాయకులు జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాబేళ్ల సంరక్షణతో పర్యావరణానికి మేలు

కవిటి, మే 2(ఆంధ్రజ్యోతి): సముద్రతాబేళ్లతో పర్యావరణానికి మేలు చేకూరుతుందని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ ఆర్.రాఘవయ్య అన్నారు. సీహెచ్ కపాసుకుద్ది గ్రామంలో శుక్రవారం తాబేలు పిల్లలను సముద్రంలో విడిచిపెట్టారు. అటవీశాఖ, ట్రీ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన తాబేలు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ రవికుమార్,రక్షణ దళ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌తో సమస్యల పరిష్కారం

ఆమదాలవలస, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ ఎంతో దోహదపడుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు నూక అప్పలసూరనాయుడు (రాజు) తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయ వద్ద శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 62 వినతులు అందినట్టు ఆయన తెలిపారు. కూటమి నాయకులు టీవీ రమణమూర్తి, వండాన మురళి, అన్నెపు భాస్కరరావు తదిరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ లాకర్ల తనిఖీ

ఆమదాలవలస, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన బంగారు, వెండి ఆభరణాలకు సంబంధించి బ్యాంక్ లాకర్లను అధికారులు దేవస్థానం అర్చకులు శుక్రవారం పరిశీలించారు. స్థానిక స్టేట్‌బ్యాంక్, ఆంధ్రా బ్యాంక్ లాకర్లను సుమారు 20 ఏళ్ల నుంచి ఎటువంటి తనిఖీలు చేయలేదు. రాజమండ్రికి చెందిన పల్లంరాజు జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి అలయ జేఈవో టి.రవి, బరంపురానికి చెందిన మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి

శ్రీకాకుళం కల్చరల్, మే 2(ఆంధ్రజ్యోతి): పాలకొండ రోడ్‌లో ఉన్న ఉపనిషన్మందిరంలో ఆదిశంకరాచార్యులు జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గుమ్మ నగేష్, వి.కామేశ్వరరావు, బాబూరావు, పతంజలి శాస్త్రి, డాక్టర్ కోమలరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే గుజరాతీపేటలో ఉన్న రాజరాజేశ్వరి లలిత పీఠంలో అర్చకులు శ్రీరామచంద్ర శేఖర్ శర్మ ఆధ్వర్యంలో శ్రీ ఆదిశంకరాచార్యులు జయంతి ఉత్సవాలు ప్రారంభించారు.

అలంకరణలో అమ్మవారు



శ్రీకాకుళం కల్చరల్, మే 2(ఆంధ్రజ్యోతి): పాత శ్రీకాకుళం ఉన్న సంతోషిమాతకు వైశాఖ మాస శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో ఉద్యాపన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక వస్త్రాలంకరణ, అలంకరణ నిర్వహించారు.

వేడుకగా జలయాత్ర


కలశాలతో జలయాత్ర చేస్తున్న మహిళలు

ఇచ్ఛాపురం, మే 2(ఆంధ్రజ్యోతి): బాలకృష్ణా పురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రాధా కృష్ణ మందిర ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం జలయాత్ర నిర్వహించారు. మూడు రోజులు పాటు నిర్వహించనున్న ప్రతిష్ఠ మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు.

చెరువు పనులు ప్రారంభం

కవిటి, మే 2(ఆంధ్రజ్యోతి): సాగునీటి చెరువులు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ బి.అశోక్ అన్నారు. కరాపాడు గ్రామంలో ఊరచెరువు పనులను శుక్రవారం ప్రారంభించారు. రూ.8లక్షలుతో పనులు చేసి సాగుతోపాటు తాగునీటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు యత్నిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఇచ్ఛాపురం ఎఎంసీ చైర్మన్ మణిచంద్రప్రకాష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల్లో అవార్డు

కవిటి, మే 2(ఆంధ్రజ్యోతి): కవిటి పంచాయతీలోని కవిటికొత్తూరు గ్రామానికి చెందిన పి.శివదేవికి భగవద్గీత మెమరీ టెస్టులో గోల్డ్‌మెడల్ సంపాదించింది. గణపతి సచ్చిదానంద స్వామి ట్రస్టు(దత్తపీఠం) వారు ఆన్‌లైన్‌లో గతనెల 27,28 తేదీలలో నిర్వహించారు. ఈపోటీల్లో ఉత్తమంగా శివదేవి నిలిచినందుకు గోల్డ్‌మెడల్ సంపాదించిందని ప్రకటించారు.

మెగా రక్తదాన శిబిరం

అరసవల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): నైరా వ్యవసాయ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని కళాశాల అసోసియేట్ డీన్ భరతలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో సుమారు 90 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్ని రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ జగన్మోహనరావు, ఎన్ఎస్ఎస్ అధికారులు ఎస్.గోవిందరావు, స్పందన, ప్రొఫెసర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రోయిన్ పనులకు భూమిపూజ

సోంపేట, మే 2(ఆంధ్రజ్యోతి): మండల రైతాంగానికి ప్రధాన నీటి వనరు అయిన బారువ గ్రోయిన్ పనులకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. రూ.27లక్షలతో చేపట్టనున్న పనుల వల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఇరిగేషన్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

శ్రీకాకుళం రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బలగలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు పాత్రునివలస గ్రామానికి చెందిన రావాడ కోటేశ్వరరావు(50) శుక్రవారం ఉదయం ఆదివారంపేట సమీపంలోని ఓ ప్రైవేట్ స్కూల్ వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. కోటేశ్వర రావుకు మద్యం తాగే అలవాటుతోపాటు ఫిట్స్ ఉంది. ఇతడు నగరంలోని మాటూరు రామారావు షాపులో పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. కొన్నేళ్ల కిందట ఇతడు భార్య నుంచి విడిపోయాడు. వీరికి ఒక కుమార్తె ఉంది. ఈ ఘటనపై రూరల్ ఎస్ఐ కె.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి ఒకరు..

జి.సిగడాం, మే 2(ఆంధ్రజ్యోతి): జి.సిగడాం-చాంద్రంగి రైల్వే లైన్ మధ్య శుక్రవారం రైలు కిందపడి బోనంగి భాస్కరరావు(43) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భాస్కరరావు ఎచ్చెర్లలోని ఎస్ఎస్ఎల్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తూ చిలకపాలెంలో ఉంటున్నాడు. మద్యానికి బానిసైన భాస్కరరావు భార్య ఆదిలక్ష్మితో నిత్యం గొడవపడేవాడు. ఈ క్రమంలో గురువారం కూడా భార్యతో గొడవపడి పోలీస్ స్టేషన్‌కి వెళతానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. మృతుడికి భార్య ఆదిలక్ష్మితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

కిడ్నీ వ్యాధితో ఇంటర్ విద్యార్థి..


కిశోర్ (ఫైల్)

పొందూరు, మే 2(ఆంధ్రజ్యోతి): కేశవదాసుపురం (కేడీ పురం) గ్రామానికి చెందిన లింగాల కిశోర్(16) కిడ్నీవ్యాధితో బాధపడుతూ గురువారం రాత్రి విశాఖ కేజీహెచ్‌లో మృతిచెందాడు. ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న కిశోర్ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. తల్లిదండ్రులు విశాఖలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్య పరీక్షల్లో రెండు కిడ్నీలు పూర్తిగా పాడైనట్టు గుర్తించిన వైద్యులు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. పేద కుటుంబం కావడంతో కిశోర్‌ను విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. రెండు కిడ్నీలు పనిచేయకపోవడంతో పరిస్థితి విషమించి మృతి చెందాడు. కిశోర్ దీర్ఘకాలంగా కంటిచూపు సమస్య తో బాధపడుతున్నా.. 10వ తరగతి వరకు లోలుగు జడ్పీ హైస్కూల్‌లో చది వాడు. కుమారుగా మృతితో తల్లిదండ్రులు సుజాత, రాజులు కన్నీరుమున్నీరయ్యారు. చలాకీగా తిరిగే కిశోర్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కిశోర్ మృతిపై లోలుగు పాఠశాల హెచ్ఎం సంజీవరావు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

జలుమూరు (సారవకోట), మే 2(ఆంధ్రజ్యోతి): అవలింగి గ్రామానికి చెందిన కె.సుదర్శనరావు (45) శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సుదర్శనరావు కరోనా నుంచి అనారోగ్యానికి గురై మనస్తాపంతో గతనెల 26న ఇంటిలో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య సంతోషి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

సారాతో ఇద్దరి అరెస్టు

ఇచ్ఛాపురం, మే 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో చేసిన దాడుల్లో 3 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని బాసుదేవ్ మహంతిని అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. అలాగే కమలాయిపుట్టుగలో జరిపిన దాడుల్లో జగ్గారావు అనే వ్యక్తిని అరెస్టు చేసి అతడి వద్ద ఉన్న 10 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నా మన్నారు. సారా, ఒడిశా మద్యం తరలింపు, మద్యంషాపుల్లో ఎంఆర్‌పీ ధరలు ఉల్లంఘించినట్టు గుర్తిస్తే 14405 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

హరిపురం, మే 2(ఆంధ్రజ్యోతి): మందస మండలం కారిగాం గ్రామంలో సోంపేట ఎస్‌టీఎఫ్, ఎస్‌హెచ్‌వో ఆధ్వర్యంలో చేసిన దాడుల్లో 500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు సీఐ కె.బేబి తెలిపారు. గ్రామాల్లో సారా తయారు చేసినా, అమ్మినా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు


జ్ఞాపికలను అందిస్తున్న యువజన సంఘం ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు, మే 2(ఆంధ్రజ్యోతి): గురుడుభద్రలో షైనింగ్ స్టార్ యువజన సంఘం 25వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల కు చెందిన జనపద కళాకా రుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రెలారేరెలా జానకిరాం, కుమార్ నాయక్, దాసరి తాతారావు, అమ్మా రామకృష్ణ వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టారు. జానపద, సినీకళాకారులను, జాతీయస్థాయి బాడీబిల్డర్ గణేష్‌ను నిర్వాహకులు సత్కరించారు. రాష్ట్రస్థాయి డీఎస్సీ మోడల్ పరీక్షలో విజేతలకు నగదు ప్రోత్సాహకాలతో పాటు జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గూడ గిరిజ, యువజన సంఘం అధ్యక్షుడు సంతోష్, మాజీ అధ్యక్షుడు పాపారావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరిగుంట ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

జలుమూరు (సారవకోట) మే 2(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడినట్లు గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదులపై కుమ్మరిగుంట ఫీల్డ్ అసిస్టెంట్ జి.రాజారావుపై ఉపాధి ఏపీడీ లోకేష్ శుక్రవారం విచారణ చేపట్టారు. గ్రామంలో వేతనదారుల నుంచి వివరాలు సేకరించారు. పనికి రాని వారికి మస్తర్లు వేశారని, వేతనదారుల నుంచి అక్రమ వసూళ్లు చేశారన్న అంశాలపై విచారణ చేపట్టామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు ఏపీడీ తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో నారాయణరావు, పలువురు వేతనదారులు పాల్గొన్నారు.

వేలాడుతున్న ఫైబర్ నెట్ కేబుల్ వైర్లు



జలుమూరులో వేలాడుతున్న కేబుల్ వైర్లను చూపిస్తున్న గ్రామస్థులు

జలుమూరు, మే 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫైబర్‌నెట్ కేబుల్ వైర్లు వేలాడుతూ ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. ఇటీవల వీచిన ఈదురు గాలులకు విద్యుత్ స్తంభా లపై ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లు నేలకొరిగాయి. వాహనదారులు గమనించకుండా వెళ్లినా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మండలంలోని అనేక గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది. జలుమూరులో పోలీసు స్టేషన్‌కు వెళ్లే మార్గంలో మెయిన్ రోడ్డుపై రోడ్డుకు అడ్డంగా వారం రోజులుగా కేబుల్ వైర్లు వేలాడి ఉన్నా సంబంధిత సిబ్బంది స్పందించడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వైర్లను సరిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నిరుపయోగం


బోరు వేసి పైప్‌లైన్ ఏర్పాటు చేయని దృశ్యం

సీది గ్రామంలో ప్రభుత్వ భవనాల సముదాయంలో బోరు వేసినప్పటికీ పైప్‌లైన్, విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయకపోవడంతో నిరుపయోగంగా ఉంది. వైసీపీ హయాంలో ఆర్బీకే, సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణం చేపట్టారు. వీటికి నీటిని అందించేందుకు గాను బోరు వేసినా పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చర్యలు చేపట్టలేదు. దీంతో వివిధ పనులపై వచ్చే ప్రజలు నీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే రోడ్డు సదుపాయం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

-పాతపట్నం, ఆంధ్రజ్యోతి

నిర్లక్ష్యం

మండల కేంద్రం జలుమూరులో ప్రయాణికులు వేచి ఉండేందుకు నిర్మించిన షెల్టర్ శిథిలా వస్థకు చేరుకుంది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. షెల్టర్ భవనం పైకప్పు పెచ్చులూడుతుండడం, ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తుండడంతో ఎప్పుడు కూలి ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

-జలుమూరు, ఆంధ్రజ్యోతి


నిరుపయోగంగా ఉన్న విశ్రాంతి భవనం

ప్రమాదకరం


కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న వంతెన

జాతీయ రహదారి నుంచి జడ్డాడ వయా కొత్తగ్రహారం మార్గంలో వంశధార ప్రధాన కాలువపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. రక్షణగోడ దెబ్బతినడంతో పాటు పెచ్చులూడి ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో మెళియాపుట్టి, పర్లాకిమిడి, గొప్పిలి, గారబంద తదితర గ్రామాలకు వెళ్లేందుకు దగ్గర మార్గంగా ఉపయోగిస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

-నందిగాం, ఆంధ్రజ్యోతి

దేవతామూర్తుల విగ్రహాలు ధ్వంసం

- నిరసన తెలిపిన బీజేపీ, సమరసత సేవా సంస్థ ప్రతినిధులు

కొత్తూరు, మే 2(ఆంధ్రజ్యోతి): కర్లెమ్మ పంచాయతీ నేతాజీనగర్ కాలనీ మూడురోడ్ల కూడలి లోని ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం అర్ధరాత్రి తరువాత గుర్తు తెలియని వ్యక్తులు దేవతా విగ్రహాలను ధ్వంసం చేసిన ఘటన సంభవించింది. అర్ధరాత్రి ఈదురు గాలులు, భారీ వర్షం కురిసిన సమయంలో ఆరుబయట ఎవరూ లేకపోవడంతో ఇదే అదునుగా శ్రీరాముడు, వినాయకుడు, సువర్చలాదేవి విగ్రహాల చేతులను ధ్వంసం చేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో కాలనీలో ఉద్రిక్తత నెలకొంది. తెల్లవారు జామున విగ్రహాల చేతులు, ఆంజనేయ స్వామి తోక పూర్తిగా తొలగించి ఉండడాన్ని అటుగా వెళ్లిన స్థానికులు గమనించి గ్రామస్థులకు తెలియజేశారు. కొత్తూరు సీఐ ప్రసాద్ అమరావతి పీఎం సభకు బందోబస్తుకు వెళ్లడంతో పాతపట్నం సీఐ వి.రామారావు, కొత్తూరు ఎస్ఐ అమీర్ ఆలీ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి వివరాలు సేకరించారు. దేవతామూర్తుల విగ్రహాలను ధ్వంసం చేశారన్న విషయం తెలుసుకున్న బీజేపీ మహిళా విభాగం జిల్లా కన్వీనర్ కాపాకల దమయంతి, సమరసత సేవా సంస్థ జిల్లా మహిళా కన్వీనర్ బృందావతి లక్ష్మణరావు తదితరులు అక్కడికి చేరుకుని నిరసన తెలిపారు. విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని తక్షణం శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసు అధికారులు ఎంత నచ్చజెప్పినా వారు నిరసనను కొనసాగించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అమీర్ ఆలీ తెలిపారు. విగ్రహాల ధ్వంసం హిందూ వ్యతిరేకులా లేక ఆకతాయిలు చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా ఘటన జరిగిన తరువాత శుక్రవారం ఉదయం ఆలయం వద్ద పోలీసులు సీసీ కెమెరాలను అమర్చడం చర్చనీయాంశమైంది.


ధ్వంసమైన సువర్చలా, వినాయకుడు, ఆంజనేయ స్వామి విగ్రహాలు


నిరసనకారులతో మాట్లాడుతున్న పోలీసు అధికారి

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు: ఎస్పీ


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

పలాస, మే 2(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులతో ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితుల సమస్యలు పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటామన్నారు. కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో వచ్చిన ఫిర్యాదులు ఆయా పోలీస్ స్టేషన్లుకు పంపి తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం కాశీబుగ్గలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నరసన్నపేట కోర్టు న్యాయాధికారిగా వాణి


న్యాయాధికారి బి.వాణికి పుష్పగుచ్ఛం ఇస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

నరసన్నపేట, మే 2(ఆంధ్రజ్యోతి): స్థానిక సివిల్ కోర్టు న్యాయాధికారిగా బి.వాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన న్యాయాధికారి సి. హరిప్రియ పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ సివిల్ కోర్టుకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో విజయనగరం జిల్లా శృంగవరపు కోట సివిల్ కోర్టు న్యాయాధికారిగా ఉన్న వాణి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా న్యాయాధికారికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావాడ కొండలరావు, ఏజీపీ గొండు సత్యనారాయణ, సభ్యులు రేణంకి కృష్ణంనాయుడు, జీవీజీ నాయుడు, రెడ్డి జగన్నాథం, జామి కామేశ్వరరావు, తులుగు మధు, యాళ్ల నర్సింగరావు, రాజ్‌కుమార్, శ్రీలక్ష్మి తదితరులు అభినందించారు.

డీఎంహెచ్‌వో విచారణ

పాతపట్నం, మే 2(ఆంధ్రజ్యోతి): బైదలాపురం పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో డా.అనిత శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిగా ఉంటూ ఇటీవల రిటైరైన డా.సదాశివపై వైద్యురాలు సత్యవేణి సీఎం పేషీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వారి ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు ఆమె తెలిపారు. విచారణలో డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ కేథలిన్ తదితరులు పాల్గొన్నారు. సదరు వైద్యుడు తనను వేధిస్తూ ఉండేవారని, అనేక పర్యాయాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించకపోవడంతో సీఎం పేషీకి ఫిర్యాదు చేసినట్లు డా.సత్యవేణి తెలిపారు.

తప్పిదాలు లేకుండా రీ సర్వే చేపట్టాలి: ఆర్డీవో


మాట్లాడుతున్న ఆర్డీవో గ్రంథి వెంకటేష్

పలాసరూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీవో గ్రంథి వెంకటేష్ ఆదేశించారు. తహసీల్దార్ కార్యాల య సమావేశ భవనంలో శుక్రవారం నియోజకవర్గంలోని తహసీల్దార్లు, సర్వే యర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకటవ దశ రీసర్వేలో తప్పులుంటే సరిచేసుకోవాలన్నారు. ప్రస్తుతం పైలట్ దశలో సాగుతున్న రీ సర్వే-2ను పారదర్శకంగా చేపట్టాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే వాటిని పరిశీలించి సరిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీ ల్దార్లు, సర్వేయర్లు, సచివాలయాల అధికారులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం


చర్చిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపేష్

ఒడిశా

పర్లాకిమిడి, మే 2 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధ నలు ఆచరణీయమని ఎమ్మెల్యే రూపేష్ కుమార్ పాణిగ్రాహి అన్నారు. శుక్రవారం గజపతి జిల్లా గుమ్మా సమితి రాంనగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన చర్చిని ప్రారంభించారు. హింసించిన వారిపై కూడా దయ చూపడం వల్ల ఏసుక్రీస్తు కరుణామయుడయ్యారన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గ్రామదేవత ఉత్సవాలు ప్రారంభం


పాతపట్నం: దేవర ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు

పాతపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి): తెంబూరు గ్రామంలో చింతలపోలమ్మ గ్రామ దేవత ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొమ్మిదేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ ఉత్సవాల నిమిత్తం వీధులు విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉదయం మహిళలు పెద్ద ఎత్తున కలశాలతో ఊరేగింపుగా అమ్మవారి గుడికి వచ్చి ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం దేవరను తీసుకువచ్చే కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. ఈ దాండియా, కాళీమాత వేషధారణలతో ఊరేగింపు నిర్వహించారు.

కాకినాడపేటలో శ్రీరామమందిరం..

పోలాకి, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రియాగ్రహారం పంచాయతీ కాకినాడపేటలో రామ మందిర ప్రారంభం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు దార్లపూడి గణేష్‌శర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, రక్షాధారణ, అఖండదీపారాధన, యాగశాల ప్రవేశం, మండల మండపారాధాన, జలాధివాసం, పల్లకిలో ఉత్సవమూర్తుల ఊరేగింపు తదితర కార్యక్రమాలు చేపట్టారు. బాలిక కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ, మహాన్న దానం చేపడతామన్నారు. ● దీర్ఘాశి దుర్గాగిరి అమ్మవారి 10వ జాతర శుక్రవారం ప్రారంభమైంది. ఆలయ అర్చకులు జడా దాలయ్య, చిన్నారావు, సాయి అమ్మవారికి ప్రత్యేక పూజలు, పుష్పాలంకరణ, మహిళలతో సామూహిక కుంకుమ పూజలు చేయించారు.


పోలాకి: ఊరేగింపులో బాలికల కోలాట ప్రదర్శన

'ఆపరేషన్ కగార్'ను నిలుపుదల చేయాలి



నిరసన తెలుపుతున్న వామపక్ష, ప్రజా సంఘాల సభ్యులు

పలాసరూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరిట కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న కాల్పులను తక్షణమే నిలుపుదల చేయాలని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్రజా సంఘాల నేతలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ్, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు మాట్లాడుతూ.. ఛత్తీస్‌గడ్, తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్ట కొండలను ఇటీవల పారా మిలటరీ దళాలు చుట్టుముట్టడం దారుణమని, ఈ ప్రాంతంలో ఉన్న మావోయిస్టు పార్టీ నేతలను లక్ష్యంగా ఈ దాడులు చేపడు తున్నారన్నారు. కొండల్లో నివసిస్తున్న ఆదివాసీలను ఏమాత్రం పట్టించుకోకుండా నిరంకుశంగా హతమారుస్తున్నారన్నారు.

సీపీఐ మావోయిస్టు కేంద్ర కమిటీ శాంతిచర్చలకు తెలిపిన సంసిద్ధతను స్వాగతిస్తున్నామన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారు లకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు ఎం.రామారావు, చాపర వేణు, కొర్రాయి నీలకంఠం, లక్ష్మణరావు, పుచ్చ దుర్యోధన, పోతనపల్లి అరుణ తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ ప్రారంభం


వాలీబాల్‌లో శిక్షణ ఇస్తున్న దృశ్యం

పాతపట్నం మే 2(ఆంధ్రజ్యోతి): యువతలో క్రీడోత్సాహం పెంపొందించాలని పీడీ యెన్ని శేఖర్‌బాబు అన్నారు. స్థానికంగా మహేంద్ర డిగ్రీ కళాశాల ఆవరణలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఎస్‌డీవో పర్యవేక్షణలో నెల రోజుల పాటు ఈ శిక్షణ ఇవ్వనున్నామన్నారు. వాలీబాల్, క్రికెట్ ఆటల్లో క్రీడా మెలకువలు నేర్పనున్నందున విద్యార్థులు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు జె.కృష్ణ, డి.లక్ష్మణరావు, జె.శ్రీను ఎల్.గణేష్, కె.రాంబాబు, బి.లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

16 మంది వైద్య సిబ్బందికి నోటీసులు

నరసన్నపేట, మే 2(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట ఏరియా ఆసుపత్రిలో 16 మంది వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులను రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ అధికారుల ఆదేశాల మేరకు జారీ చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రికి వచ్చే సమయంలో ముఖ ఆధారిత హాజరు (ఎఫ్ఆర్ఎస్) సకాలంలో వేయకపోవడంతో గత మూడు నెలలుగా పలు పర్యాయాలు సక్రమంగా విధులకు హాజరుకాకపోవడంతో నలుగురు వైద్యులకు, 12 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. వారి నుంచి వ్యక్తిగతంగా వివరాలు తీసుకుని ఉన్నతాధికారులకు నివేదించను న్నామన్నారు.

నేడు న్యాయవిజ్ఞాన సదస్సు

టెక్కలి, మే 2(ఆంధ్రజ్యోతి): మండల మహిళా సమాఖ్య కార్యాలయం, శ్రీలక్ష్మి జీడిపప్పు పరిశ్రమలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. అసంఘటిత కార్మికులకు న్యాయసేవల పథకం 2015 అంశంపై ఈ సదస్సు ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

నైపుణ్య కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

పలాస, మే 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఉద్యోగ, ఉపాధి నైపుణ్య కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ పైల జవహర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్కిల్ హబ్ సెంటర్‌లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వెల్డింగ్, సీసీ టీవీ టెక్నిషియన్ కోర్సులు ప్రారంభిస్తున్నామన్నారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు వయసున్నవారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికేట్లతో హాజరుకావాలని, ఇతర వివరాలకు 63010 46329 నెంబరులో సంప్రదించాలన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు వైద్య పరీక్షలు

నరసన్నపేట, మే 2(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘ భవనంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 78 మంది రిటైర్డ్ ఉద్యోగులకు జెమ్స్ వైద్యులు పరీక్షించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఎస్.ప్రభాకర్, చంద్రశేఖర్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు వీఆర్వోల కేటాయింపు

మందస, మే 2(ఆంధ్రజ్యోతి): మందస మండలానికి కొత్తగా ముగ్గురు వీఆర్వోలను కేటాయిం చినట్లు తహసీల్దార్ ఎస్.హిమవతి తెలిపారు. మందస-1కు ఎం.శ్రీకాంత్, నారాయణ పురానికి జి.సురేష్, ఎం.క్రాంతికి సాబకోటకు పదోన్నతిపై నియమించారని, ఈ మేరకు బాధ్యతలు స్వీక రించారన్నారు. వీరు ఇతర మండలాల నుంచి ఇక్కడికి కేటాయించబడ్డారని తెలిపారు.

నేడు షిర్డీసాయి మందిర వార్షికోత్సవం

నందిగాం, మే 2(ఆంధ్రజ్యోతి): నందిగాంలో షిర్డీసాయి ధ్యానమందిరం ఆరో వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం కాకడా హారతి, సుప్రభాతసేవ, గణపతి, దత్తాత్రేయ, సాయి బాబాలకు విశేష అభిషేకాలు, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపడుతున్నామన్నారు. సాయంత్రం తిరువీధి ఉత్సవం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.

రామిరెడ్డికి నివాళి

నందిగాం, మే 2(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ దాసూరి రామిరెడ్డి వర్ధంతిని శుక్రవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బాలక శంకరరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి రామిరెడ్డి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఎ.కుమారస్వామి, వై.గణపతి, వి.చిన్నవాడు తదితరులు పాల్గొన్నారు.